క్లుప్తంగా

ఘనంగా ల్యాబ్ టెక్నీషియన్ డే



ల్యాబ్ టెక్నీషియన్ రమేష్‌బాబును సన్మానిస్తున్న సిబ్బంది

నారాయణవనం: అంతర్జాతీయ ల్యాబ్ టెక్నీషియన్ డేను సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఘనంగా జరుపుకున్నారు. ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్ రమేష్‌ను శాలువ కప్పి, పూలమాలలు వేసి తోటిసిబ్బంది సన్మానించారు. కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి దర్శిత్‌రాజ్ మాట్లాడుతూ రోగ నిర్ధారణ అయితే గానీ మెరుగైన వైద్యాన్ని అందించలేమని, ల్యాబ్ టెక్నీషియన్ల నైపుణ్యత, నిబద్ధతపైనే రోగ నిర్ధారణ సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో రాగసుధ, సీహెచ్‌ఓ శ్రీనివాసులు, ఫార్మసిస్ట్ బాబు, స్టాఫ్ నర్సులు సుభాషిణి, దేవీభారతి, అరుణ, వరలక్ష్మి, ఏఎన్‌ఎంలు తదితరులు ఉన్నారు.

మృత్యుంజయ స్వామికి విశేష పూజలు



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మృత్యుంజయస్వామికి సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ముందుగా స్వామివారికి పాలు, పంచామృతం, చందనం, విభూతి, పచ్చకర్పూరంతో అభిషేకం నిర్వహించారు. అనంతరం పలురకాల పుష్పాలు, గజమాల, వెండి నాగాభరణంతో మృత్యుంజయస్వామిని శోభాయమానంగా అలంకరించారు. ధూప, దీప నైవేద్యాలు, మహామంగళహారతులు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

18న కల్యాణ వెంకన్న పుష్పయాగం

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో 18న పుష్పయాగం నిర్వహించనున్నట్లు టీటీడీ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 11 నుంచి 19వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో అర్చక, పరిచారకులు, అధికార, అనధికారులు, భక్తుల వల్ల తెలియక ఏవైనా లోపాలు జరిగి ఉంటే వాటికి ప్రాయశ్చిత్తంగా పుష్పయాగం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా 17వ తేదీ సాయంత్రం అంకురార్పణ, మార్చి 18న ఉదయం 10 నుంచి 11 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు పుష్పయాగం చేపడతారు. 18న నిత్య కల్యాణోత్సవాన్ని టీటీడీ రద్దు చేసింది.


ఆలయ నిర్మాణానికి రూ.6.66 లక్షల విరాళం



దాతలను సత్కరిస్తున్న యారాశి చంద్రశేఖర్ రెడ్డి

చంద్రగిరి: గ్రామదేవత మూలస్థాన ఎల్లమ్మ ఆలయ పునర్ నిర్మాణానికి సోమవారం నరసింగాపురానికి చెందిన మాజీ ఎమ్మెల్యే రెడ్డివారి రాజశేఖర్ రెడ్డి తనయుడు ప్రీతమ్ రెడ్డి రూ.1,75,776, దివంగత విశ్వనాథ రెడ్డి కుమారుడు సాయిశ్రావణ్ రెడ్డి రూ.50,116, దుర్గం కమలాకర్ రూ.51,116 విరాళం ఇచ్చారు. అదే విధంగా గ్రామస్తులు తమ వంతుగా రూ.3,89,390 సమకూర్చారు. ఈ మొత్తాన్ని నరసింగాపురం గ్రామం తరపున ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డికి సోమవారం అందజేశారు. వారికి ఆలయ చైర్మన్ అమ్మవారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈట రామకృష్ణారెడ్డి, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

చురుగ్గా 'చెత్త సంపద' తయారీ కేంద్రాల నిర్మాణం



సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీవో రాజశేఖర్ రెడ్డి

చంద్రగిరి: జిల్లా వ్యాప్తంగా చేపట్టిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల(ఎస్‌డబ్ల్యూపీసీ) నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డీపీవో ఆదెం రాజశేఖర్‌రెడ్డి ఆదేశించారు. ఆయన సోమవారం ఈఓపీఆర్డీ శశిరేఖతో కలిసి నరసింగాపురంలో ఎస్‌డబ్ల్యూపీసీ నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన సంపద తయారీ కేంద్రాలను త్వరలో అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.

రేణిగుంట: పోలింగ్ కేంద్రానికి వెళుతున్న ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తిరుపతి ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం







ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

- పట్టభద్రుల ఓట్లు 77.6శాతం
- ఉపాధ్యాయుల ఓట్లు 94.7శాతం

శ్రీకాళహస్తి: నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో ప్రశాంతంగా పోలింగ్ ముగిసింది. అన్ని పోలింగ్ బూత్‌ల్లో గ్రాడ్యుయేట్లు క్యూలో నిల్చుకుని ఓట్లు వేశారు. శ్రీకాళహస్తి నియోజకవర్గం పరిధిలో 4 మండలాలకు గాను 10 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. ఈ పోలింగ్ బూత్‌ల్లో అత్యధిక స్థాయిలో ఓటింగ్ శాతం నమోదు అయింది. చెదురుమదురు ఘటనలు మినహా శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజన్‌లో సోమవారం జరిగిన తూర్పు రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ రెవెన్యూ డివిజన్‌లో ఎనిమిది మండలాలకు గాను మొత్తం 15,043మంది పట్టభద్రులు ఉండగా 11,683మంది తమ ఓటు హక్కును వినియోగించుకోవడంతో 77.6 శాతం పోలింగ్ నమోదైంది. ఉపాధ్యాయుల ఓట్లు 811 ఉండగా 768మంది ఓటేయడంతో 94.7శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారి తెలిపారు. తొట్టంబేడు మండలంలో ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ పోలింగ్ కేంద్రంలో 972 మంది పట్టభద్రుల ఓట్లకు గాను 790మంది ఓట్లు నమోదయ్యాయి. ఉపాధ్యాయులు 30మంది ఉంటే 29 ఓట్లు పోలయ్యాయి. ఏర్పేడు మండలంలో రెండు బూత్‌లు ఏర్పాటు చేశారు. పట్టభద్రులు 970కిగాను 742మంది, ఉపాధ్యాయులు 58మందికి 54మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. రేణిగుంట మండలంలో రెండు బూత్‌లు ఏర్పాటు చేశారు. మొదటి బూత్‌లో పట్టభద్రులు 1,013కిగాను 726మంది, రెండవ బూత్‌లో 949మందికిగాను 681మంది ఉపాధ్యాయులు 126మందికిగాను 120ఓటు హక్కు వినియోగించుకున్నారు. శ్రీకాళహస్తిలో 6 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పట్టభద్రులు మొదటి కేంద్రంలో 968గాను 768మంది, రెండవ కేంద్రంలో 964మందికిగాను 762, మూడవ కేంద్రంలో 964మందికి గాను 735, నాలగవ కేంద్రంలో 656గాను 478మంది, ఐదవ కేంద్రంలో 864కుగాను 693మంది, ఆరవకేంద్రంలో 1,050గాను 779మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉపాధ్యాయులు 439మంది ఉంటే 413 ఓట్లు పోలయ్యాయి. కేవీబీ పురం మండలంలో 1,006కనుగా 836, ఉపాధ్యాయులు 18గాను 16పోలయ్యాయి.

విప్, ఎంపీ పరిశీలన

రేణిగుంట: శాసన మండలి ఎన్నికలు సోమవారం రేణిగుంట బాలుర ఉన్నత పాఠశాలలో ప్రశాంతంగా ముగిశాయి. పోలింగ్ కేంద్రానికి ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తిరుపతి డాక్టర్ మద్దెల గురుమూర్తి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి చేరుకుని ఓటింగ్ సరళిని పరిశీలించారు. ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి పోలింగ్ సరళిని పర్యవేక్షించారు. వారితోపాటు రేణిగుంట ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ సంధ్య, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, సర్పంచ్ నగేషం, గంగారి రమేష్, జువ్వల దయార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అలస్యంగా వచ్చిన వారిని అనుమతించక పోవడంతో వెనుదిరిగిన మహిళా ఓటర్లు

వాగ్వాదం

పోలింగ్ కేంద్రం లోపలికి వైఎస్సార్ సీపీ నాయకులను పంపారని ఆరోపిస్తూ టీడీపీ నాయకులు నినాదాలు చేశారు. అయితే లోపల ఎవ్వరూ వైఎస్సార్ సీపీ నాయకులు లేరని అందరూ ఇక్కడ నుంచి దూరంగా వెళ్లాలని సీఐ సుబ్బారెడ్డి సూచించి ఇరు వర్గాలను అక్కడ నుంచి పంపారు. రేణిగుంట మండలంలో పని చేసే ఓ వీఆర్‌వో ఎన్నికల విధుల నిమిత్తం లోపలికి వెళుతుండగా, గేటులో పోలీసు సిబ్బంది అడ్డుకుని గట్టిగా పట్టుకోవడంతో వివాదాస్పదమైంది. తహసీల్దార్ శివప్రసాద్ కలుగజేసుకుని వివాదాన్ని పరిష్కరించారు.

మండలంలో 81శాతం పోలింగ్

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని తొట్టంబేడు గ్రామంలో ఉన్న జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. దాదాపుగా 81శాతం పోలింగ్ నమోదు అయ్యింది. పోలింగ్ సరళిని ఎమ్మెల్యే బియ్యపు మధుసూధన్ రెడ్డి, వారి కుమార్తె పవిత్రరెడ్డి, బీజేపీ పట్టభద్రుల అభ్యర్థి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, సీపీఐ నాయకులు పరిశీలించారు. సీఐ విక్రమ్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ రాఘువేంద్ర పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

ఏర్పేడులో 76 శాతం

ఏర్పేడు: ఏర్పేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 76 శాతం ఓట్లు పోలయ్యాయని తహసీల్దారు ఉదయ్‌సంతోష్ తెలిపారు. రేణిగుంట డీఎస్పీ రామచంద్రయ్య, ఏర్పేడు సీఐ శ్రీహరి పోలింగ్ సరళిని పర్యవేక్షించారు. పోలీసులు పోలింగ్ స్టేషన్ పరిధిలో 144 సెక్షన్ అమలు చేశారు. సాయంత్రం బ్యాలెట్ బాక్స్‌లకు అధికారికంగా సీల్ వేసి శ్రీకాళహస్తి స్కిట్ కళాశాలకు తరలించారు.



తొట్టంబేడు: పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకుంటున్న యువకుడు



రేణిగుంట: క్యూలోని ఓటర్ల సందేహాలు నివృత్తి చేస్తున్న తహసీల్దార్ శివప్రసాద్



రేణిగుంట: ఓటు వేసిన పట్టభద్ర ఓటర్లు







తొట్టంబేడు: పోలింగ్ కేంద్రం వద్ద క్యూలో నిరీక్షిస్తున్న ఓటర్లు, రేణిగుంట: వైఎస్సార్‌సీపీ, టీడీపీ నేతలను చెదరగొడుతున్న పోలీసులు, ఏర్పేడు: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సరళిని పర్యవేక్షిస్తున్న డీఎస్పీ రామచంద్రయ్య

టీడీపీ నాయకుల అత్యుత్సాహం

శ్రీకాళహస్తి: పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మూడు బూత్‌లను ఏర్పాటు చేశారు. ఇక్కడ బూత్‌లో దొంగ ఓట్లు పడిపోతున్నాయంటూ తెలుగుదేశం నాయకులు అత్యుత్సాహం ప్రదర్శించారు. వైఎస్సార్‌సీపీకి ఎక్కువ ఓట్లు పోలయ్యాయని తెలుసుకుని ఎలాగైనా రీపోలింగ్ చేయించాలనే ఉద్దేశంతో చెంచమనాయుడు, రవీంద్రనాథ్‌రెడ్డి, కృష్ణమనాయుడు మరి కొందరి పోలింగ్ కేంద్రాల్లోకి దూరాలని ప్రయత్నించారు. వైఎస్సార్‌సీపీ ఏజెంట్లపై దురుసుగా ప్రవర్తించారు. ఎన్నికలు ముగిసే అరగంట ముందు పోలింగ్ బూత్‌లోకి ప్రవేశించారు. దీంతో ఇరువర్గాల మధ్య తోపులాట చోటుచేసుకుంది. సీఐ అంజుయాదవ్ బృందం ఆధ్వర్యంలో ఇరువర్గాల వారిని పోలింగ్ బూత్‌ల నుంచి బయటకు పంపించి తలుపులు వేశారు. ఏ విధమైన దొంగ ఓట్లు పడలేదని ఆర్డీవో రామారావు తెలిపారు. కమిషనర్ బాలాజీనాయక్ మాట్లాడుతూ దొంగ ఓట్లు వేసే అవకాశమే లేదని స్పష్టం చేశారు. అనంతరం బొజ్జల సుధీర్‌రెడ్డి టీడీపీ నాయకులను వెంట బెట్టుకుని పోలింగ్ బూత్‌ల్లోకి జొరబడటానికి ప్రయత్నించారు. పోలీసులు అడ్డుకోవడంతో డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. 144 సెక్షన్ ఉన్నా నినాదాలు చేయడంతో పక్కనే వైఎస్సార్‌సీపీ నాయకులు కూడా జై జగన్ అంటూ నినాదాలు చేశారు. దీంతో ఉద్రిక్త పరిస్థితులు ఎదురవుతాయన్న ఉద్దేశంతో పోలీసులు ఇరు వర్గాలను అక్కడి నుంచి పంపేశారు. అక్కడి నుంచి వెళ్లిపోయిన తెలుగుదేశం నాయకులు తమపై దాడి చేశారని, దుర్భాషలాడారంటూ ప్రచారం చేసుకోవడం గమనార్హం.

సంక్షేమ ప్రభుత్వానికే విద్యావంతుల మద్దతు

- వైఎస్సార్‌సీపీ బలపరచిన ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపు ఖాయం
- ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

వరదయ్యపాళెం: విద్యావంతులు, మేధావులు సీఎం జగనన్న పాలనను మెచ్చి ఓటేశారని, శాసన మండలి ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థులే ఘన విజయం సాధిస్తారని స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ధీమా వ్యక్తం చేశారు. పట్టభద్రులు, విద్యావంతులు జగనన్న పాలనకు మద్దతు పలుకుతూ ఈ ఎన్నికల్లో మంచి తీర్పు ఇవ్వనున్నారని తెలిపారు. వరదయ్యపాళెంలోని గోవర్ధనపురం హైస్కూల్‌లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సరళిని పరిశీలించిన ఆయన స్థానిక పార్టీ శ్రేణులతో కలసి విలేకరులతో మాట్లాడారు. సెమీ ఫైనల్ తరహాలో జరిగిన ఈ ఎన్నికల తీర్పుతో రాష్ట్రంలోని ప్రధాన ప్రతిపక్షానికి చెంపపెట్టు కానుందన్నారు. సాహసోపేత నిర్ణయాలతో రాష్ట్ర అభివృద్ధితో పాటు సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అన్ని వర్గాల మద్దతు లభిస్తుందన్నారు. పోలింగ్‌కు 2 రోజుల ముందే ఓటమి భయం పట్టుకున్న చంద్రబాబు అనవసరపు ఆరోపణలతో ఓటమిని కప్పిపుచ్చుకునేందుకు దిగజారుడు విమర్శలు చేస్తున్నారన్నారు. ఈ ఎన్నికల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్ రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఘన విజయం సాధిస్తారన్నారు. ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్న ఓటర్లకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యే వెంట మండల కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు దామోదర్ రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ చిన్నా, మాజీ సర్పంచ్ బొప్పన తిలక్‌బాబు, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ బందిల సురేష్, సోషల్ మీడియా కో-కన్వీనర్ శోభన్ యాదవ్, మాజీ మండల కన్వీనర్ పాల సుబ్రమణ్యం రెడ్డి, సర్పంచులు ఉన్నారు.

సత్యవేడులో భారీగా పోలింగ్

- నియోజకవర్గంలో పట్టభద్రుల ఓటింగ్ 81.19 శాతం, టీచర్ల ఓటింగ్ 94 శాతం నమోదు
- భారీగా హక్కు వినియోగించుకున్న ఓటర్లు
- పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం
- పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు



పిచ్చాటూరులో పోలింగ్ సరళిపై ఆరాతీస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం





పిచ్చాటూరులో బారులు తీరిన ఓటర్లు, బుచ్చినాయుడు కండ్రిగలో ఓటేసిన పట్టభద్రుడు

పిచ్చాటూరు: సత్యవేడు నియోజకవర్గంలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిశాయి. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అధికారులు పటిష్ట చర్యలు చేపట్టారు. అలాగే నియోజకవర్గంలో భారీగా పోలింగ్ శాతం నమోదైంది. మొత్తం 7591 పట్టభద్రులు ఓటర్లు ఉండగా సోమవారం జరిగిన ఎన్నికల్లో 6163 ఓట్లు పోలయ్యాయి. మొత్తం 81.19 శాతం పోలింగ్ జరిగినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. అలాగే ఉపాధ్యాయ ఓటర్లు మొత్తం 276 మంది ఉండగా అందులో 260 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. టీచర్ల ఓట్ల పోలింగ్ శాతం 94.20గా నమోదైంది. పోలింగ్ సరళిని 7 మండలాల్లో స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పరిశీలించగా, నారాయణవనం, నాగలాపురం, సత్యవేడు మండలాల్లో జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యులు కోనేటి సుమన్‌కుమార్ పరిశీలించారు. టీడీపీ ఇన్‌చార్జ్ హెలన్ నాగలాపురంలో బారికేడ్లు దాటి లోపలికి వెళ్లే ప్రయత్నం చేయగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు అడ్డుకున్నారు. వెంటనే పోలీసులు జోక్యం చేసుకోవడంతో ఆమె వెనుదిరిగారు. ఎన్నికలను పుత్తూరు, శ్రీసిటీ డీఎస్పీలు రామరాజు, జగదీష్ నాయక్, సీఐ సురేష్‌కుమార్, శివకుమార్ రెడ్డి, ఆయా మండలాల ఎస్‌ఐలు సిబ్బందితో పర్యవేక్షించారు. తహసీల్దారులు ఏఆర్‌ఓలుగా వ్యవహరించారు.

పిచ్చాటూరులో..

పిచ్చాటూరు: మండలంలో పట్టభద్రులు ఓటింగ్ 82 శాతం, అలాగే ఉపాధ్యాయులు పోలింగ్ 100 శాతం పోలింగ్ నమోదైనట్లు ఏఆర్‌ఓ మధుసూదన్ రావు తెలిపారు. పోలింగ్ సరళిని స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, టీడీపీ ఇన్‌చార్జ్ హెలెన్ పరిశీలించారు. పుత్తూరు డీఎస్పీ రామరాజు, సీఐ సురేష్ కుమార్, ఎస్‌ఐ శ్రీకాంత్ రెడ్డి బందోబస్తు నిర్వహించారు.

నాగలాపురంలో..

నాగలాపురం: మండలంలో పట్టభద్రులు ఓటింగ్ 81.49 శాతం, ఉపాధ్యాయులు ఓటింగ్ 100 శాతం పోలింగ్ నమోదైనట్లు ఏఆర్‌ఓ ప్రసన్నకుమార్ తెలిపారు.

సత్యవేడులో..

సత్యవేడు: మండల పరిధిలో పట్టభద్రులు ఓట్లు 1394కు గానూ 1145 ఓట్లు పోలయ్యాయి. టీచర్స్ ఎమ్మెల్సీ ఓట్లు 44కు గానూ 42 పోల్ అయ్యాయి. శ్రీసిటీ డీఎస్పీ జగజదీష్ నాయక్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ పురుషోత్తం రెడ్డి గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. స్థానిక అధికారులు పోలింగ్‌ను పర్యవేక్షించారు.

బుచ్చినాయుడుకండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో ఉపాధ్యాయ ఓటింగ్ 91 శాతం నమోదు కాగా, పట్టభద్రుల ఓటింగ్ 76 శాతం నమోదైనట్లు ఎన్నికల అధికారి శివయ్య తెలిపారు. అలాగే 1967వ సంవత్సరంలో డిగ్రీ చదివిన బుచ్చినాయుడుకండ్రిగకు చెందిన నాగేశ్వరరావు ఓటు హక్కును వినియోగించుకున్నారు. డిగ్రీ చదివి 55 ఏళ్ల అయిందని, ఇప్పుడు ఓటు వేయడం సంతోషంగా ఉందని ఆయన తెలిపారు.



బీఎన్ కండ్రిగలో పోలీసు బందోబస్తు



సత్యవేడులో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ జగదీష్ నాయక్

ఓటరు వివరాలు..

పట్టభద్రులు				
వ. సంఖ్య	మండలం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం
1	పిచ్చాటూరు	703	579	82.36
2	నాగలాపురం	805	656	81.49
3	సత్యవేడు	1394	1145	82.14
4	నారాయణవనం	1509	1272	84.29
5	వరదయ్యపాళెం	1201	926	77.10
6	బి.ఎన్ కండ్రిగ	976	749	76.74
7	కేవీబీ పురం	1003	836	83.35
	మొత్తం	7591	6163	81.19

టీచర్లు				
వ. సంఖ్య	మండలం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం
1	పిచ్చాటూరు	18	18	100
2	నాగలాపురం	38	38	100
3	సత్యవేడు	44	42	95.45
4	నారాయణవనం	84	80	95.24
5	వరదయ్యపాళెం	40	35	87.50
6	బి.ఎన్ కండ్రిగ	34	31	91.18
7	కేవీబీ పురం	18	16	88.89
	మొత్తం	276	260	94.20

న్యాయశాఖ ఉద్యోగుల జోనల్ సెక్రటరీగా సంజీవ్

తిరుపతి లీగల్ : రాష్ట్ర న్యాయశాఖ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జోనల్ సెక్రటరీగా తిరుపతి 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఉద్యోగి సీహెచ్ వెంకటసంజీవ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కడప జిల్లా కోర్టు ఆవరణలో రెండు రోజుల క్రితం రాష్ట్ర న్యాయ శాఖ నాలుగో తరగతి ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు రామరాజ చంద్రశేఖర్, ముఖ్య సలహాదారు ఎస్.మస్తాన్‌వలి, కోశాధికారి సాయికుమార్ ఆధ్వర్యంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య కార్యదర్శిగా ఎస్.ప్రసాద్, అదనపు కార్యదర్శిగా రెడ్డికుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వెంకటసంజీవ్‌కుమార్ ఎన్నికపై తిరుపతిలోని కోర్టుల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

బలిజ భవన్ నిర్మాణం కోసం కాపు చైర్మన్‌కు వినతి

తిరుపతి కల్చరల్: తిరుపతిలోని బలిజభవన్ నిర్మాణానికి సహకరించాలని కాపు సంఘ నేతలు కోరారు. వారు సోమవారం తాడేపల్లిలోని కాపు కార్పొరేషన్ కార్యాలయంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషును కలిసి వినతి పత్రం అందజేశారు. స్పందించిన కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి చర్చించి నిధులు విడుదల చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆర్కాట్ కృష్ణప్రసాద్, కిరణ్‌బాబు, జొన్న వెంకట్, మహేష్, సురేష్ పాల్గొన్నారు.



కాపు కార్పొరేషన్ చైర్మన్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న నేతలు